క్లుప్తంగా

ఉత్సాహంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


ఫాదర్ సిల్వియో పాస్క్వలీ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న సిస్టర్లు

పెదవేగి : ఏసుక్రీస్తు బోధనలను అనుసరిస్తూ శాంతి మార్గంలో అందరూ జీవించాలని సీఎస్‌ఏ ప్రొవిన్షియల్ సుపీరియర్ సిస్టర్ శౌరీలియు అన్నారు. పెదవేగి మండలం పినకడిమిలోని ఫాదర్ సిల్వియో పాస్క్వలీ విద్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొవిన్షియల్ సుపీరియర్ సిస్టర్ శౌరీలియు పాల్గొని, క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా క్రీస్తు జన్మదిన దృశ్యాన్ని ప్రదర్శించారు. కరస్పాండెంట్ సిస్టర్ స్వర్ణ ఇన్నాసమ్మ విద్యార్థులకు కేక్ పంచుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ ప్రభావతి, ఇతర సిస్టర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి పలువురి సంతాపం


తాతా సత్యనారాయణ (ఫైల్)

పెదవేగి : వైఎస్సార్‌ సీపీ నాయకుడు, పెదవేగి మాజీ సర్పంచ్ తాతా సత్యనారాయణ (72) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన పెదవేగి ఎంపీపీ తాతా రమ్యకుమార్ మామ. సత్యనారాయణ పీసీసీ సభ్యుడిగా, ఏలూరు డీసీఎంఎస్ డైరెక్టర్‌గా సేవలందించారు. గాంధేయ వాదిగా పేరుతెచ్చుకున్నారు. సత్యనారాయణ మృతి పట్ల పలువురు నాయకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మృతికి సంతాపం

దెందులూరు: డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తాత సత్యనారాయణ ఆకస్మిక మరణం కలచివేసిందని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు ఆదివారం అన్నారు. సత్యనారాయణ మృతికి వారు సంతాపం వ్యక్తం చేశారు.

కేంద్రమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి


బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

భీమడోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ భీమడోలు సంతమార్కెట్ వద్ద ఆదివారం సాయంత్రం వివిధ సంఘాల ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలిపారు. అమిత్‌షా బహిరంగ క్షమాపణలు చెప్పాలంటూ నినదించారు. సంతమార్కెట్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని తొలగించడం కోసం బీజేపీ ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా దాడి చేస్తోందని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రైతు సంఘం ఉపాధ్యక్షుడు జి.ప్రసాద్, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముళ్లగిరి జాన్సన్, సంఘాల నాయకులు పైడిమాల యుగంధర్, న్యాయవాది రాకేష్ మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలు ప్రతి ఒక్కరినీ బాధించాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కట్టా భాస్కరరావు, రాహుల్, రిటైర్డ్ హెచ్‌ఎం వైఆర్‌కే శర్మ, బెంజిమన్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే సందడి



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

దెందులూరు : విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యమే ప్రధానం కావాలని వేగవరం హేలాపురి ఇనిస్టూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ లావణ్య అన్నారు. ఆదివారం కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత కళాశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కళాశాల ఏవో కరుణానిధి మాట్లాడుతూ బీటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు స్వాగతం పలికారు. వేడుకల్లో హెచ్‌ఓడీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటి ఆశలతో దాళ్వా సాగుకు సిద్ధం


దాళ్వా నారుమడిలో విత్తనాలు చల్లుతున్న రైతు


మొలకలు వస్తున్న నారుమడి

- సార్వా నష్టాల నుంచి బయట పడేందుకు ప్రయత్నం
- వ్యవసాయ పనుల్లో రైతన్నల నిమగ్నం

గణపవరం: ఆది నుంచి అష్టకష్టాలతో సాగిన సార్వా పంట చివరికి రైతులకు భారీ నష్టాలనే మిగిల్చింది. తక్కువలో తక్కువ అంటే ఎకరాకు పదివేల రూపాయల వరకూ రైతులకు నష్టం వాటిల్లడంతో రైతుల నోట మాటలేకుండా పోయింది. అయినా పొలంబాట తప్ప మరోబాట తెలియని రైతన్నలు కొత్త ఆశలతో దాళ్వా వైపు అడుగులు వేస్తున్నారు. గణపవరం మండలంలో ఇప్పటికే చిలకంపాడు, కాశిపాడు పరిధిలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈవారంలో మరికొందరు రైతులు వరినాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పొలాలను దమ్ముచేసి నాట్లు వేయడానికి సిద్ధం చేశారు. అయితే విచిత్రంగా మండలంలో మెజార్టీ రైతులు ఇంకా నారుమడులు తయారీలోనే ఉన్నారు. కొన్ని చోట్ల విత్తనాలు చల్లుతున్నారు. మరో వారం రోజుల్లో మొత్తం నారుమడులు పూర్తి చేసే అవకాశం ఉంది. మొత్తంమీద వచ్చే నెలాఖరుకు దాళ్వా నాట్లు పూర్తయ్యే అవకాశం ఉంది. సంక్రాంతికి నాటికే నూరుశాతం నాట్లు పూర్తిచేయాలన్న లక్ష్యంతో వ్యవసాయ అధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు.


దాళ్వా నాట్లు వేయడానికి దమ్ముచేసిన పొలం


చిలకంపాడు ప్రాంతంలో ముమ్మరంగా వరినాట్లు

సార్వా నష్టాలు

గత సార్వా పంట ఆరంభంలో భారీ వర్షాలు వరదల కారణంగా 90శాతం వరినాట్లు పూర్తిగా పాడైపో యి, రైతులు రెండోసారి నారుమడులు, వరినాట్లువేయాల్సి వచ్చింది. సార్వా మాసూళ్ల సమయంలో వర్షాలు, తుఫాన్లు, వాయుగుండ ప్రభావంతో మాసూళ్లు పూర్తిచేయడానికి రైతలకు ఖర్చులు రెట్టింపయ్యాయి. తగ్గిన దిగుబడి, పెరిగిన పెట్టుబడితో రైతులకు సార్వా పంట నష్టాలనే మిగిల్చింది.

నియోజకవర్గంలో 60 వేల ఎకరాల్లో దాళ్వా

ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 60వేల ఎకరాల్లో దాళ్వా వరిసాగు జరుగుతుంది. మెట్ట ప్రాంతాలైన ఉంగుటూరు, భీమడోలు మండలాల్లో బోర్లున్న పొలాల్లో వరినాట్లు పూర్తయ్యాయి. కాలువ కింద భూముల్లో ఇప్పుడిప్పుడే నాట్లు ప్రారంభమయ్యాయి. గణపవరం, నిడమర్రు మండలాల్లో ఇంకా వరినాట్లు వేగం పుంజుకోలేదు. ఈనెలాఖరుకు వరినాట్లు ముమ్మరమయ్యే అవకాశం ఉంది.

మురగ దమ్ములు ప్రారంభం

నారుమడులు వేయడం పూర్తిచేసిన రైతులు పొలం దమ్ములు ప్రారంభించారు. ఇప్పటికే రైతులు జింక్, బోరాన్ ఎరువుల మిశ్రమాన్ని పొలంలో వేసి మురగ దమ్ములు చేస్తున్నారు. దీనివల్ల వరి మోడులు, పొలంలో మిగిలిపోయిన వరిగడ్డి బాగా కుళ్లి భూమిలో కలిసిపోతుంది. దీనివల్ల వరినారుకు బలం చేకూరుతుంది.

తగ్గిన బొండాల సాగు

రబీలో రైతులు బొండాల సాగుపై ఆసక్తి చూపుతారు. గతేడాది రబీలో పండించిన బొండాలు ధాన్యం ఏడాది దాచినా గిట్టుబాటు ధర రాలేదు. దీంతో ఈసారి చాలామంది రైతులు బొండాల సాగుకు దూరమయ్యారు. సన్న రకాలైన శ్రీధృతి, తరింగిణి, చంద్ర, సంపద తదితర రకాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈస్వల్పకాలిక రకాలు పంటకాలం 125 రోజులే కావడం వల్ల ముందుగానే కోతకు వస్తాయని రైతులు చెబుతున్నారు. కొందరు రైతులు స్వర్ణ రకం సాగు చేస్తున్నారు.

> **త్వరగా నాట్లు పూర్తిచేయాలి**
>
> వాతావరణ పరిస్థితులు దృష్ట్యా రైతులు త్వరగా నారుమడులు పూర్తిచేయాలి. ఈనెలాఖరుకు నాట్లు పూర్తిచేయడానికి యత్నించాలి. కనీసం జనవరి మొదటి వారంలోగా నాట్లు పూర్తి చేయాలి. రబీసాగుకు స్వల్పకాలిక విత్తనాలు సాగుచేస్తే మంచి ఫలితాలుంటాయి.
>
> – యర్రంశెట్టి ప్రసాద్, ఏవో, గణపవరం

నేడు కనకదుర్గాదేవి విగ్రహాల ప్రతిష్ఠ


అమ్మవారి విగ్రహాలను ట్రాక్టర్‌పై ఊరేగింపుగా తీసుకుని వస్తున్న దృశ్యం

భీమడోలు: గుండుగొలను బీసీ కాలనీలో వేంచేసియున్న కనకదుర్గాదేవి ఆలయ పరివార సహిత ప్రతిష్ఠామహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23న సోమవారం నిర్వహించనున్న అమ్మవారి విగ్రహాల పునఃప్రతిష్ఠలో భాగంగా ఆలయ ప్రాంగణం వద్ద ప్రత్యేక పూజలు ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ రాంపల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ లంకా శ్రీనివాస శర్మ బ్రహ్మత్వంలో పండితుల ఆధ్వర్యంలో పూజలు, హోమం వైభవంగా కొనసాగుతున్నాయి. తొలుత అమ్మవారి విగ్రహాలను ముస్తాబు చేసిన ట్రాక్టర్‌పై ఊరేగింపుగా ఆలయానికి తీసుకుని వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసారు.

రామానుజన్ ఆదర్శనీయులు

భీమడోలు: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గణిత ఘనాపాటి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, పెద్దలు ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రామానుజన్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని వారన్నారు. చిన్న వయస్సు నుంచి అసాధారణ ప్రతిభ గల బాలుడిగా గుర్తింపు పొందారన్నారు. విద్యార్థి దశ నుంచి గణితం పట్ల ఆసక్తిని పెంచుకుని చక్కగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేద మంత్రాలతో మార్మోగుతున్న పంచాయతన క్షేత్రం

మందలపర్రులో మహారుద్ర హోమం ప్రారంభం


మహారుద్ర యజ్ఞ హోమం నిర్వహిస్తున్న రాఘవేంద్రశర్మ, వేద పండితులు

నిడమర్రు: మందలపర్రు ఉమా నీలకంఠేశ్వర స్వామి పంచాయతన క్షేత్రం వేద మంత్రోచ్ఛరణతో మార్మోగుతోంది. లోక కల్యాణం ఆశించి ప్రవాస భారతీయుడు, వైదిక జ్యోతిష్య పరిశోధకులు అక్కినప్రగడ రాఘవేంద్రసాయి (ఇంగ్లాండ్) యజ్ఞ కర్తగా ఆలయ ప్రాంగణంలో మహారుద్ర యజ్ఞ హోమ కార్యక్రమాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ యజ్ఞ, హోమాలు ఈనెల 26వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు ఆదివారం 27 మంది సువాసినులు, 21 మంది వేద పండితులు ముందస్తు యజ్ఞ పూజలు, యాగశాల ప్రవేశం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 6 గంటల వరకూ ఈ మహా రుద్ర యజ్ఞ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ ఐదురోజులు గణపతి పూజ, శుద్ధి పుణ్యాహవచనం, రుత్విక్ వర్ణం, చతుర్వేద పారాయణం, యాగశాల ప్రదక్షిణ, గో, అశ్వం, మేషం పూజలు నిర్వహిస్తున్నారు. దేశం సుభిక్షం ఆశించి ఈ పంచాయతన క్షేత్రంలో మహారుద్ర యజ్ఞం సంకల్పించినట్లు యజ్ఞ కర్త రాఘవేంద్ర శర్మ తెలిపారు.

108 రకాల సుంగధ ద్రవ్యాలతో : దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన 108 రకాల సుంగధ ద్రవ్యాలు, వివిధ చెట్ల వేర్లు, మూలికలు ఆవు నెయ్యితో 50 కిలోల చూర్ణం గుళికలుగా చేసి ఈ యజ్ఞ పూజల్లో వినియోగిస్తున్నారు. ప్రత్యేకంగా తెప్పించిన 400 కిలోల స్వచ్ఛమైన ఆవు నెయ్యి, 800 కిలోల రావి సమిదలు (పుల్లలు) ఈ 5 రోజుల పాటు ఈ హోమంలో వేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 21 మంది రుత్విజులు ఈ పూజల్లో పాల్గొంటున్నారు. ఈ మహారుద్రయజ్ఞం పూజల కోసం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకమైన యాగశాలలను నిర్మించారు. యాగశాల లోపల 4 ఆకృతుల్లో నిర్మించిన కుండీల్లో (హోమ గుండాల్లో) హోమాలు నిర్వహించనున్నారు. 5వ రోజు ఈ నాలుగు హోమగుండాల్లో ఏకకాలంలో పూర్ణాహుతి కార్యక్రమం ఉంటుందని యజ్ఞ కర్త రాఘవేంద్రశర్మ తెలిపారు.

గ్రామాల్లో జగనన్న పుట్టినరోజు వేడుకలు


గుండుగొలనులో జగనన్న కాలనీలో కేక్ చేస్తున్న అభిమానులు

భీమడోలు: కురెళ్లగూడెం, చెట్టున్నపాడు, గుండుగొలను గ్రామాల్లో శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరిగాయి. గ్రామాల్లో బాణసంచా కాల్చారు. కేక్‌లు కట్ చేసారు. కురెళ్లగూడెం సర్పంచ్ గుడివాడ నాగ గౌతమి సీతారామాంజనేయులు ఇంటి వద్ద సీనియర్ పార్టీ నాయకులు పాటంశెట్టి అచ్యుతరామయ్య కేక్ కట్ చేసారు. గుండుగొలను జగనన్న కాలనీలో లబ్ధిదారులు, జగనన్న అభిమానులు కేక్ చేసారు. చెట్టున్నపాడులో వైఎస్సార్ సీపీ నాయకులు బుంగా జయరాజ్ కేక్ చేసారు. భీమడోలు ఆరుంధతీ కాలనీలో ఓ బాలుడు వైఎస్సార్ చిత్రపటాన్ని పట్టుకుని నినదించారు. గ్రామాల్లో బాణ సంచా కాల్చారు. ఈ కార్యక్రమాల్లో మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీ ఓనమాల సుజాత, నాయకులు కురెళ్ల నారాయణస్వామి, ఓరా జయరాజు, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా అబ్బయ్య చౌదరి పుట్టినరోజు వేడుకలు


మాజీ ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

దెందులూరు: దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, నడుమ కోలహాలంగా జరిగింది. తొలుత జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, ఏలూరు జెడ్పీటీసీ సరస్వతి కొండలరావు, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలనవకాంతం గంగరాజు, మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు, వీరమాచినేని నాగబాబు, కనకదుర్గమ్మ ఆలయ బోర్డు మాజీ మెంబర్ తోత్తడి వేదకుమారి, నియోజవర్గ నాయకులు డీబీ ఆర్‌కే చౌదరి కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కొఠారు అబ్బయ్య చౌదరి వచ్చే ఎన్నికల్లో దెందులూరు ఎమ్మెల్యేగా విజయం సాధించడం తథ్యమన్నారు. వేడుకల్లో ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లం ప్రసాదు, పలువురు సర్పంచులు, జిల్లా కార్యదర్శి గొల్ల కిరణ్, ఏలూరు పార్లమెంట్ కార్యదర్శి సంతోష్, పులవర్తి దేవానంద్, పెదవేగి మండలం పార్టీ అధ్యక్షుడు జానంపేట బాబు పాల్గొన్నారు.

నేడు పశువైద్య శిబిరం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం బొమ్మిడిలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.శిరీష్ తెలిపారు. పెంటపాడు పశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్థక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వైద్యశిబిరంలో గర్భకోశ వ్యాధుల చికిత్స నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శిరీష్ కోరారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ

బుట్టాయగూడెం: పడమర రేగులకుంటలో ఆదివారం ఘనంగా గంగానమ్మ, ముత్యాలమ్మ, గణపతి విగ్రహాల నూతన ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆలయాన్ని, విగ్రహాల ఏర్పాటును గ్రామస్తుల సహకారంతో నిర్మించారు. బి.ప్రసాద్, బీజేపీ నాయకులు కొండేపాటి రామకృష్ణలు రూ.5000 నగదును ఆలయ కమిటీ వారికి అందజేశారు. జలపాలరాయుడు తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పెదవేగి నవోదయ విద్యాలయంలో 2006 బ్యాచ్ విద్యార్థులు

పెదవేగి : వారంతా పాతికేళ్ల క్రితం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి, ఏడేళ్ల పాటు కలిసి చదువుకున్న విద్యార్థులు. ఆరు నుంచి 12వ తరగతి వరకూ చదువుకుని 2006లో ఉన్నత చదువులకు వెళ్లిపోయారు. కాలక్రమంలో వివిధ ప్రాంతాల్లో ఉన్నత చదువులు పూర్తి చేసుకుని, ఉద్యోగాల్లో చేరి వివిధ వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన బాల్య స్నేహితులంతా కలిసి ఆదివారం వారు చదువుకున్న నవోదయ విద్యాలయంలో సందడి చేశారు. పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు వారు ఉత్సాహంగా నిర్వహించారు. పాతమిత్రులను కలుసుకుని బాల్యంలోని విషయాలన్నీ నెమరు వేసుకుని ఆనందంగా గడిపారు. సుమారు 35 మంది భార్యాబిడ్డలతో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆనాడు చదువు చెప్పిన గురువులు కేవీ నాగరాజకుమార్, వీబీకే మూర్తి, శేఖర్ బాబు, దుంపా శ్రీనివాసరావు, శాంతారావు, పి.కోటేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు, ఎన్‌పీ సుజాత, లక్ష్మణరావు తదితరులు హాజరయ్యారు. గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి విలువైన మార్గదర్శకత్వం అందించిన టీచర్ సింహాచలం, కెప్టెన్ టీవీఎన్ రావుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నవోదయ విద్యాలయం మరింత అభివృద్ధి చెందుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్‌సీసీ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేయాలి

- తక్షణం ప్రభుత్వం స్పందించాలి
- న్యాయం చేయకుంటే ఆందోళనకు సిద్ధమంటున్న హెల్త్ అసిస్టెంట్లు

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హెల్త్ అసిస్టెంట్ల (మేల్) తొలగింపు ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు పాలకులకు కనువిప్పు కావాలని హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగుల సంఘాలు అంటున్నాయి. రెండు దశాబ్దాలకుపైగా తాము అందించిన వైద్యసేవలను రాష్ట్ర ప్రభుత్వం గౌరవించకుండా, గుర్తించకుండా అఘమేఘాల మీద తొలగింపు ఉత్తర్వులు తీసుకువచ్చిందని హెల్త్ అసిస్టెంట్లు అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మెరిట్ లిస్టు సిద్ధం చేసి తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను ఉద్యోగాల్లోకి తీసుకోవాలని వారు కోరుతున్నారు. ప్రైమరీ హెల్త్ సెంటర్లల్లో ఉన్న హెల్త్ అసిస్టెంట్లను కూటమి ప్రభుత్వం తొలగించింది. దెందులూరు నియోజకవర్గంలో పెదపాడు పీహెచ్‌సీలో ఇద్దరు, పోతునూరు పీహెచ్‌సీలో ఇద్దరు, గోపన్నపాలెం పీహెచ్‌సీలో నలుగురు, పెదవేగి పీహెచ్‌సీలో ఇద్దరిని తొలగించారు. సెకండ్ లిస్టులో నియోజకవర్గంలో మరి కొంతమంది ఉన్నారని హెల్త్ అసిస్టెంట్లను భయాందోళనకు గురిచేశారని వారన్నారు. 2003 తర్వాత డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో నియమితులైన హెల్త్ అసిస్టెంట్లను ప్రభుత్వ అర్ధాంతరంగా తొలగించడంతో అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఇన్నేళ్లు వైద్య సేవలు అందించి అకస్మాత్తుగా ఉద్యోగం కోల్పోతే తమ కుటుంబాల జీవనం అస్తవ్యస్తమవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ భద్రత దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మరోసారి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని హెల్త్ అసిస్టెంట్లు కోరుతున్నారు.

మా కుటుంబాల పరిస్థితి ఏమిటి



ప్రతి హెల్త్ అసిస్టెంట్ ఆదాయంపై కుటుంబం ఆధారపడి ఉంటుంది. ఆకస్మాత్తుగా ఉద్యోగాల నుంచి తొలగిస్తే వారి పరిస్థితి ఏమిటి? ఉద్యోగాలు కోల్పోయిన వారు ఎలా జీవించాలి. ప్రభుత్వం అనాలోచితంగా తీసుకున్న నిర్ణయం చాలా మంది జీవితాలను ప్రభావితం చేస్తుంది.
– నున్న గురునాథం, హెల్త్ అసిస్టెంట్

కోర్టు గడువు ఇచ్చింది



హెల్త్ అసిస్టెంట్ల విషయంలో కోర్టు 120 రోజులు గడివిచ్చింది మెరిట్ లిస్టు తయారు చేయమని ఆదేశాలు ఇచ్చింది. కోర్టు ఆదేశాలు అమలు చేయకుండా అకస్మాత్తుగా హెల్త్ అసిస్టెంట్లను తొలగించడం ఎంతవరకు సమంజసమని హడావుడిగా ఉద్యోగాల నుంచి హెల్త్ అసిస్టెంట్లను తొలగించారు.
– కృష్ణమూర్తి, హెల్త్ అసిస్టెంట్

నోటీసు లేకుండా ఎలా తొలగిస్తారు



జీవో 1207 హెల్త్ అసిస్టెంట్లకు శాపంగా మారింది. ప్రభుత్వం హెల్త్ అసిస్టెంట్లకు నోటీసు ఇవ్వలేదు. నిబంధనలు పాటించలేదు. హఠాత్తుగా ఉద్యోగాల నుంచి తొలగించారు. తొలగించిన ప్రతి హెల్త్ అసిస్టెంట్‌పై ఇద్దరు ముగ్గురు కుటుంబ సభ్యులు ఆధారపడి జీవిస్తున్నారన్న విషయం ప్రభుత్వం గుర్తించలేదు.
– ఆదినారాయణ, హెల్త్ అసిస్టెంట్

మా సేవలను అవమానించారు



ఇన్నేళ్లుగా మేము ప్రజలకు చేసిన వైద్య సేవలను ప్రభుత్వం అవమానించింది. హఠాత్తుగా తొలగించాల్సిన అవసరం లేనప్పటికీ ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా, నోటీసులు ఇవ్వకుండా ఉద్యోగాల నుంచి తొలగిస్తే ఈ పరిణామం దేనికి సంకేతం. మా సమస్యలను అన్ని యూనియన్లకు తెలియజేసి మద్దతు కోరతాం.
– సింగరాజు, హెల్త్ అసిస్టెంట్

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన సమాజం


వడ్లపట్లలో కోడిగుడ్డు, నిమ్మరసంతో కషాయం తయారు చేస్తున్న మండల ట్రైనర్ నిర్మల, రైతులు, సిబ్బంది

భీమడోలు: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన సిద్ధిస్తుందని మండల ట్రైనర్ నిర్మల అన్నారు. అంబర్‌పేట పంచాయతీ శివారు వడ్లపట్లలో ఆదివారం రబీ సీజన్‌లో పురుగులు, తెగుళ్ల నివారణకు ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఆధ్వర్యంలో రైతుల సమక్షంలో 400 లీటర్ల దశపర్ని కషాయాన్ని తయారు చేసారు. పంట ఆరోగ్యవంతంగా పెరిగేందుకు కోడిగుడ్డు, నిమ్మరసంతో 20 లీటర్ల ద్రావణాన్ని తయారు చేసారు. రైతులకు ద్రావణాల తయారీపై సిబ్బంది అవగాహన కల్పించారు. రైతులు అనవసరంగా రసాయనాలు, పురుగు మందులను వాడడం ద్వారా ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. రబీలో పంటకు సోకే తెగుళ్లను నివారించుకునేందుకు కషాయాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి శేఖర్, ఐసీఆర్‌పీలు మహేష్, నాగరాజు, పరశురాం, విజయరాజు పాల్గొన్నారు.

రాట్నాలకుంటలో మాజీ హోంమంత్రి పర్యటన

పెదవేగి : ద్వారకాతిరుమల మండలం వేంపాడు సర్పంచ్ చవల రమేష్ ఇంటి వద్ద నిర్వహించిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి ఏపీ మాజీ హోంశాఖ మంత్రి తానేటి వనిత హాజరయ్యారు. రాట్నాలకుంట అమ్మవారి మండపంలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఎంపీపీ బొండాడ వెంకన్నబాబు, గుర్రాల లక్ష్మణ్ ఉన్నారు.